# చందమామలోని మచ్చ

రచన: మహేశ్వర్ -

సౌజన్య నిత్యం సినిమాకెళుతూందంటే; ఫిల్ము చూడ్డం ఓహో యెత్తూ, వార్తాచిత్రాలు చూడటం ఓహో యెత్తూను!

యుద్ధచిత్రం ప్రారంభంకాగానే తెరంతా చిందులు త్రొక్కేవి ఆమె చీకటికళ్లు. అందరూ తలనెప్పని బాధపడే చిత్రాలామెకి వెన్నెల స్వప్నాలై వెలిగేవి. ఆ చిత్రాల ప్రతి అంగుళంలో తనేదో చూడాలన్న వాంఛ, ఎవర్నో వెతుక్కోవాలనే ఆతృత ఆమె కనుపాపల్లో మెరుస్తూంటాయ్.

ఒకానొక చిత్రంలో సైనికులు వారివారి బంధుమిత్రాదుల దగ్గరనుండొచ్చిన ఉత్తరాలు అందుకొని చదవటం చూచినప్పటి సన్నివేశంలో సౌజన్య హృదయంపడే తికమకలు యేమని వర్ణించడం!

తాను వలచి వలపించుకున్న ప్రియమైన బావ మందహాసంతో ఆ గుంపులోకొచ్చి తాను "బొమ్మల పెళ్లిళ్ల ముచ్చట్లతో రాసిన లేఖ అందుకోడేం? ముద్దుబావ యే టాంకుప్రక్క నిద్రపోతున్నాడో? ఓస్ — వీళ్లంతా టీ త్రాగుతున్నారు — గడ్డం సిపాయ్‌కి ఎన్ని ఉత్తరాలో — బావ ఉత్తరం ఎక్కడ పెట్టేరో — ఛస్ — కలిగిపోయింది దృశ్యం! మళ్లా మరఫిరంగులు లారీలు, టాంకులు, దిక్కుమాలిన యంత్రాలు! బావ కనబడతాడా? ఏ దేశంలో ఉన్నాడో! భారతీయ వీరకృత్యాలు ఫిల్ములు తియ్యరటగా! బావ కేంప్‌లో దృశ్యాలు యెప్పుడేనా ఫిల్ము తియ్యరా!"

గత్యంతరంలేక యుద్ధంలో చేరిపోయిన తన బావ సంగతి నిత్యం తల్చుకుంటూ, రాత్రిళ్లు సినిమాలూ, పగలు Indian Information లాంటి యుద్ధ ప్రచారక పత్రికలూ చూసి చూసి, యుద్ధంలో మెసిలేవాళ్ల కథలువింటూ బావ బొమ్మకోసం, బావ నీడకోసం గుండెల్లో గుంజాటనే పడేది పదహారేళ్ళ సౌజన్య.

ఎన్ని సముద్రాలు, ఎన్ని ఆకాశాలు, ఎన్ని ఎడార్లూ మైదానాలూ దాటి వెళ్లేడో! ఆ దేశంపేరు ఎలా తెలుస్తుంది — ఒక నెంబరువేసి ఆళియా కమేండ్ అంటే వెళిపోతూంది ఉత్తరం.

బావ ఎన్ని ఉత్తరాలు రాసినా "భాస్కర్రావుగారికి ఇంక్రిమెంటు ఇచ్చేరా, సుభద్రమ్మగారి కోడలు కాపరానికొచ్చిందా, రైతులు అల్లరిచెయ్యకుండా కొలగొలుపు ధాన్యమేనా ఇచ్చేరా?" ఇలాంటివేగా — ఔను పాపం. సెన్సార్ లో ప్రభుత్వం కళ్లమీంచీ నడిచే లేఖల్లో యింకేం రాయగలడు?

* * *

సౌజన్య అవాళ మేటనీచూసి సాయంత్రం ఆరు గంటలకి ఇంటికొచ్చింది. మేడమీదికెళ్ళి రెండు చందనం బొమ్మలు పట్టుకుని దిగుతూంది గబగబా. పోష్టుమాన్ కేకవిని ఒళ్లూపై తెలీకుండా గాభరాగా మెట్లు దిగేసమయంలో ఒక చేతిలోని చందనంబొమ్మ దభేల్న క్రిందపడి, బొమ్మ చెయ్యి విరిగిపోయింది.

"సుజా! ఎవరే రాసేరు ఉత్తరం?" అంటూ నూతులోంచి కేకేసినట్టు సౌజన్య తల్లి వట్టింట్లోంచి అరచింది. "బావే రాసేడు!" అంటూ ఉత్తరం చించింది.

యుద్ధం ముగిసే సూచనలు అగుపడుతున్నాయ్. నీ బావ కొద్దిమాసాల్లో తిరిగి ఇంటికిచేరుకుంటాడు. నేనంటే నీకు ఎంత ప్రేమ! నీ హృదయం నాకు కొత్తదికాదు. కాని ఒక వేళ నేను యుద్ధంలో ఏ కాలో చెయ్యో పోగొట్టుకుని వికలాంగుడనై వస్తే అనుగ్రహిస్తావా సౌజ్! పరీక్షకే అడుగుతున్నాననుకో! ఇంతవరకూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను. వెంటనే ఉత్తరం రాయకపోతే నీబావ మీద ఒట్టు!

—నీ ప్రకాష్

ఉత్తరం మడిచి కవర్లో పెట్టి చెయ్యివిరిగిన చందనంబొమ్మతీసి ఓసారి హృదయానికదుముకునే సమయానికి నాన్నగారొచ్చేరు. బొమ్మా, విరిగిన చెయ్యీ అతనిచేతులో పెడుతూ సర్వీసుతో అంటిపించి తెప్పించమని, మేడమీదికి పారిపోయింది.

*　　*　　*

యుద్ధం ముగిసింది. సోల్జర్లు, ఇంజనీర్లూ, డాక్టర్లూ, స్వదేశాలకి, స్వస్థానాలకి మరలి ఒచ్చేస్తున్నారు. సౌజన్య తన బావకోసం నిరీక్షిస్తోంది. ముందుగా ఫలానా నాడు ఒస్తున్నానని కార్డుముక్కైనా రాసేడుకాదు. దారుణం! అంటూ యెంత కుమిలిపోతున్నా ప్రకాష్ తిరోగమనం ఆమె మనోవీధుల పొలిమేరల్లో యెక్కడా కనబడలేదు.

ప్రకాష్ ఇంటికివెళ్ళి చాలాసార్లు అత్తని వేపుకుతింది—నాకేం తెలీదమ్మా! బెంగతో బొందిబొగ్గులైంది అంటూ ఆవిడ ప్రారంభించిన సహజసోది నుండి సౌజన్య మాయమైంది.

తినే కంచంలో బావ, తాగే మంచినీళ్ళ గ్లాసులో బావ, దోమతెర మంచంలో బావ, ఎక్కడ చూసినా బావనీడే కనబడుతూండటంమూలాన్న సౌజన్య హృదయమే ఓ సినిమా తెరగా తయారైంది.

నిద్రాహారాలు ఎడబెట్టింది, నాలుగురోజులు. సౌజన్యలో సౌజన్యం, సౌందర్యం, మాయమై తోటకూర కాడలా దిగనారిపోతుంటే:

"ఇంకా బావకోసం ఆ తహతహ దేనికే! ఎదిగినపిల్లవి!! అలా ఓ మొగాడికోసం అయినదానికీ, కానిదానికీ, పలవరించటం తప్పుకాదూ! ఇంతకీ నీకూ నీబావకీ కళ్యాణయోగంలేదు!" అంటూ సౌజన్య చెవులో యేదో ఊదింది తల్లి.

*　　*　　*

"ఆ—" అంటూ బిత్తరపోయిందామె!

అవాళ సాయంత్రం ఆరుగంటలవేళ. దాసీది చెయ్యివిరిగిన చందనంబొమ్మ అతికించుకుని తెస్తూ, "సౌజమ్మా ఉదయంబండిలో మీ బావగారు దిగేరట—!" అంటూ బొమ్మనామె కొప్పజెప్పి పెరటింటికి వెళిపోయింది.

సౌజన్యకి నిజంగా మతిభ్రమణం కలిగిందేమో బొమ్మని నేలకి విసరికొడుతూ, "ఉదయం అనగా ఒచ్చిన బావ ఇంతవరకూ రాలేదేం చెప్మా!" అనుకుంటూ మేడమీదికెళ్ళి ఉత్తరంవ్రాయ ప్రారంభించింది.

బావకి:

ఉదయమే బండిదిగి ఇంతవరకూ నువ్వు నాదగ్గరికి రాలేదు—ఐనా తక్షణం పరుగెత్తుకుంటూ ఒచ్చి నీకళ్ళముందు వాలేదాన్ని! కాని......కాని నిన్నుచూచేందుకు సాహసం కలగటంలేదు.! మరి ...మరి...యుద్ధంలో నీ కుడిచెయ్యి పోయిందట!! కలలోనైనా అనుకోలేదు—గాని బావా! అవిటివాణ్ణియెలా పెళ్ళాడతావ్ అని అమ్మ నిర్బంధిస్తోంది!

విగతహస్తంతోవున్న నిన్నుచూసి నిలబడగలనా బావా! నిన్ను చూచే సాహసం యేమీలేదు. నన్ను మరిచిపొమ్మని రాయడం సులభమే! నీ రెక్కతెగిన్నాడే నా హృదయమూ తెగిపోయింది—

—నీ సౌజ',

ఆ ఉత్తరం ప్రకాష్‌కి అందటం, ఇంకా సౌజన్య బావసంగతే ఆలోచిస్తూ సావిట్లోనుంచునుంది. ప్రకాష్ మిలటరీ యూనిఫారంలో అక్కడ సాక్షాత్కరించి "సౌజా" అని పిలవగానే తల యెత్తి చూచి బిత్తరచూపులతో దగ్గరగా ఒచ్చి కాస్త తమాయించుకుని ప్రకాష్‌ని నఖశిఖపర్యంతం ఆఫీసరు చూసినమాదిరిగా చూస్తుంది!

ప్రకాష్ దూరంగా జరిగి "ఎంతగొప్పగా మరేవ్ సౌజ్!" మాటాడబోయింది గాని యెవరో పీక పట్టుకున్నట్టుగా బాధపడింది.

"'జూ' లో మృగాల్ని చూడ్డంకన్న హీనం కదూ మీ బావనిచూస్తే?"

"క్షమించు బావా! నిన్ను నిత్యం హృదయంలో నమస్కరిస్తున్నాను—"

"ఈ తిరస్కారపు ఉత్తరం యెందుకు రాసేవ్?"

ప్రకాష్ రెండుచేతుల్నీ స్పష్టంగా చూస్తుంది. హంతకురాలికన్న యెక్కువ వ్యథతో అతని దగ్గరగా వెళ్లి:

"ఎవరో కిట్టక యెంతపుట్టించేరు బావా! నీ చెయ్యి పోయిందని — నీమీద పీడపోయిందిలే ఇదకు!" అంటూ అతనిజేబుకున్న విక్టోరియా క్రాసుని ముద్దుగా తాకుతుంది.

ప్రకాష్ దూరంగాజరిగి "సౌజ్! హృదయమూ, ప్రేమా, కృత్రిమం కాకూడదు!

విగత హస్తుడైన బావని...! సౌజా! నీ కళ్లెదట యింత అవమానంతో చావాల్సి ఉండేనని తెలుస్తే యుద్ధభూమిలో యేమర ఫిరంగికో గుర్రై పవిత్రంగా వీరస్వర్గాన్నే పొందేవాణ్ణి. సౌజ్! హృదయంలేని నిన్ను నా పరిష్వంగంలోంచి తప్పించేందుకే భగవంతుడు నా రెక్క నరికేశాడు!"

అంటూ కుడివైపు రబ్బరుచెయ్యి లాగిపారేసి చకచకా వెళిపోతాడు.

రబ్బరు బొమ్మలా నిలబడి చూసే సౌజన్యకి చెయ్యివిరిగిన చందనం బొమ్మ మాత్రం కనబడుతోంది!


